
## మరదలి పరిచయంలో మరో లోకాల్లో విహరించిన బావగారికి షాక్!

# సతీవ్రతుడు




అవి నేను రామచంద్రాపురంలో ఉద్యోగం వెలగబెడుతున్న రోజులు. నేనొక పెద్ద బ్యాంకులో చిన్న ఉద్యోగిగానే వున్నాను. అప్పటికి నాకు పెళ్లయి ఆరు నెలలైంది. అయితే ఆరు నెలల్లోనూ ఏ ఒక్కరోజూకూడా నేను నా సతీమణిని విడిచి వుండలేదంటే నమ్మండి. ఆఫీసు టైం మినహాయిస్తే మిగతా సమయమంతా నాకు మా ఆవిడతోనే సరిపోయేది. ఆఖరికి ఆవిడ వంటింట్లో బిజీగా వుండే సమయంలోకూడా ఆవిడ కొంగు పట్టుకుని తిరిగితేగాని తోచేదికాదు. అక్కడికీ మా ఆవిడ నన్ను కాస్త ఈసడించుకునేదికూడా. అయినా, పొమ్మని కాలితో తన్నినా, ఇంటి చూరువదిలిపెట్టని పెంపుడు పిల్లిలాగా నేను ఓర్పుగా మా ఆవిడ వెనకే వుండేవాడిని. అలా అని, పోనీ మా ఆవిడకి పనుల్లో సాయం చేస్తానా? అంటే ఉహూ అదేమీ కాదు. అసలు నాకు వంటింటి పనంటేనే మంటంటే మీరు నమ్మరేమో! అయినా నమ్మక తప్పదు. కనీసం పాలగిన్నె స్టౌమీంచి దించి, కప్పులోకి పాలుపోయడంకూడా చేతకానివాడినని మా ఆవిడ రెండుమూడుసార్లు నేను పాలగిన్నె పట్టుకోవడం, చేతకాక పాలు పారబోసినప్పుడు నన్ను అన్నట్టు గుర్తు. అందులో నిజమెంత వుందో నాకు తెలీదుకాని, నాకు ఇంటి పని చేతకాదన్నది మాత్రం పచ్చి నిజం.

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. మా ఆవిడ నన్ను అతి నాజూగ్గా తయారుచేసి, కాలు నేలమీద పెట్టనవసరం లేనంతగా నన్ను బాగా చూసుకునేది. అసలే సోమరినేమో, పెళ్లాం వచ్చాక ఈ విధంగా మరింత సోమరితనం నాలో పెరిగిపోయింది. నిజంగా నా భార్య భగవంతుడు నాకు ప్రసాదించిన మహాభాగ్యంగా భావిస్తాను. ఇది ఊహించే కాబోలు మా అత్తమామలు ఆమెకు భాగ్యలక్ష్మి అని




పేరుపెట్టారు చిన్నప్పుడే. పేరుకి తగ్గట్టు ఆమె నా సౌభాగ్యలక్ష్మి.

నా భార్యపేరు మీకు తెలిసిందికదా! ఇకనుంచి ఆమెని భాగ్యం అని చెప్పుకుందాం. భాగ్యం తెలివి, సహనం, ఓర్పు, ధైర్యం కలబోసిన పదహారణాల ఆడపడుచు. పైగా చదువులోకూడా ఎప్పుడూ మిన్నేనట. డిగ్రీదాకా చదివి ఇక చాలని చదువు చాలిపించిందట. ఎప్పుడూ ఒక్క క్లాసులోకూడా

తప్పలేదట.

అలాంటి నా భాగ్యం ఒకరోజు హఠాత్తుగా నాకు చెవిలో చెప్పింది 'తను... తప్పిన'ని. నాకు సరిగా వినబడలేదు. వెంటనే బిగ్గరగా అడిగాను. ''అదేంటి భాగ్యం. నువ్వెప్పుడూ తప్పలేదని ఎప్పుడూ చెప్తూంటావుకదా! ఈవేళ ఏంటి ఇలా మాట్లాడుతున్నావు?'' అని. వెంటనే మా ఆవిడ సిగ్గుతో తల వంచుకుని ట్యూబ్‌లైట్ వెలగలేదని గ్రహించి, చోకలాంటి నా చెవిని మెలిపెట్టింది. ఇంకా అప్పటికీ ఏమీ అర్థకాలేదు నా మట్టిబుర్రకి ఆమె ఏం చెబుతోందో. వెంటనే భాగ్యం సీరియస్‌గా ముఖంపెట్టి స్విచ్‌బోర్డ్ దగ్గరకెళ్లి స్విచ్ ఆన్‌చేసింది. వెంటనే (నా) ట్యూబ్‌లైట్ వెలిగింది. ఒక్కసారి నన్ను నేనే మరచి, అమాంతం భాగ్యాన్ని పైకెత్తి, ఇంకా ఎత్తితే పైన సీలింగ్ ఫాన్ తగులుతుందేమోనని భయపడి, క్రిందికి దించేశాను. మా ఆవిడ సిగ్గుతో లోపలికి పరుగుతీసింది. ఆ తరువాత మా ఇద్దరి మధ్యా జరిగిన సంభాషణ ఏంటి అంటారా? ఆ ఏముందీ, మీకు తెలిసిందే. తెలీకపోతే ఏ కుటుంబ కథా ప్రధానమైన తెలుగు సినిమా చూసినా మీకర్థమౌతుంది కాబట్టి ఆ డైలాగులు స్థలాభావంచేత నేనిక్కడ రాయదలచుకోలేదు.

సరే అసలు విషయానికొద్దాం. మా ఆవిడ పుట్టింటికి వెళ్లినప్పటినుంచి మొదలైంది నా వ్యధాభరిత కథ. భాగ్యం పుట్టింటికి వెళ్లేముందు ఎలక్షన్‌లో నిలబడే అభ్యర్థికి ఎన్నికల కమిటీ వాళ్లు ఇచ్చే చేయదగినవి చేయకూడనివి పట్టికలాంటి పట్టిక ఒకటి నాకు ఇచ్చింది. నేను ఎప్పుడు ఎక్కడ ఏది ఎలా ఎందుకు చెయ్యాలో, చెయ్యకూడదో సవివరంగా తెలియజేసే ఎజెండా అది. బహుశా ఆ లిస్టు ఫాలో అయ్యేకంటే ముక్కూ మొఖం తెలియని చోటునుంచి నామినేషన్ వేసి, అత్యధిక మెజారిటీతో గెలవడం తేలికేమో! నేనుకూడా భాగ్యంమీది గౌరవంకొద్దీ ఆ సూచనలు తుచ తప్పకుండా పాటించడానికి నా శాయశక్తులా ప్రయత్నించాను.

హాయిగా హోటల్ కూడు తిందామంటే ఆ ఊళ్లో ఒక్క హోటల్‌లోనూ భోజనం బాగా వండిచావరు. ఆ తప్పనిసరి పరిస్థితుల్లో ఇంట్లోనే స్వయంపాకం మొదలెట్టాను. భీకరయుద్ధంలో శత్రుసైనికులు బోర్డరు దాటి వచ్చినప్పుడు తన రైఫిల్‌లోని ఆఖరి బుల్లెట్‌దాకా కాల్చి విసుగు, విరామం లేకుండా వీరోచితంగా పోరాడే సైనికుడిలా నేను స్టౌముందు వంటపాత్రలతో పోరాడేవాడిని. అయితే పస్తు అనే మాట లేకుండా ప్రతిరోజూ ఏదో అన్నంలాంటి పదార్థంతోనే రెండు పూటలా భోజనం ముగించేవాడిని. ఇలా అలవాటు పడీ పడీ, నేను నలభీమ పాకం తయారుచేయడంలో సిద్ధహస్తుడిని అయ్యాను అని చెప్పలేనుకానీ, పొయ్యిపై ఏదో ఒక కూడు ఉడకబెట్టడం నేర్చుకున్నాను అని అంటే బాగుంటుందేమో!

నేను పడే అవస్థలు తనకి కళ్లకి కట్టినట్టు సినిమా రీళ్లలా కనిపించాయేమో, భాగ్యం హఠాత్తుగా ఒక రోజున మా మామగార్ని, మరదల్ని స్వయంగా నా క్షేమ సమాచారాలు తెలుసుకురమ్మని పంపించింది. కాకిచేత కబురెట్టేంత దగ్గర్లో నేను లేనుకదా! అందుకని. వాళ్లది ప్రకాశం జిల్లాలో ఒక పల్లెటూరులెండి. అది ఏమిటనేది ఇప్పుడప్రస్తుతం., అయితే మామగారు రావడం వరకు ఓకే. మరి మరదలు పిల్లేమిటి? అదే అర్థం వచ్చేటట్టు మామగారివంక చూశాను. సకల మర్యాదలు అయ్యాక ఆయన చిన్న ఏ.ఎన్.ఆర్ నవ్వు నవ్వి, నేను నానా ఇబ్బందులూ పడుతుంటే తట్టుకోలేక భాగ్యమే నా మరదల్ని నాకు సాయంగా వుండమని చెప్పి పంపిందన్న వాస్తవం వెల్లడించారు. అదిగో, కథ మలుపు తిరిగింది అక్కడే.

ఏమాటాకామాట చెప్పుకోవాలి. నా మరదలుపిల్ల అందంలోనూ, అణకువలోనూ మా ఆవిడకేమాత్రం తీసిపోదని నా పెళ్ళిలోనే అనుకున్నాను ఆ పిల్లని చూసి. తను ఇంటర్‌దాకా చదివి కంపార్ట్‌మెంటల్‌గా రెండు సబ్జక్టులు రాసి రిజల్టుకోసం అలవాటు ప్రకారం ఆలస్యంగా వచ్చే ప్యాసింజర్ బండికోసం ముందు స్టేషన్‌లో వేచియున్న ప్రయాణికుడిలాగా ఎదురుచూస్తోంది. అదీ విషయం. అప్పటిదాకా ఎలాగూ ఖాళీయేకదా అని మా మరదల్ని ఆవిడే పంపించిందంటే ఉన్నమాట చెప్పొద్దూ - కాస్త సంబరంగానేవుంది.

అన్నట్టు మా మరదలు పేరుచెప్పలేదుకదూ! కృష్ణవేణి. పేరుకు తగ్గట్టు అమ్మాయి నలుపైనా, అంత నలుపేంకాదు. చామనచాయ. తీర్చిదిద్దినట్టుండే కళ్లు, కోటేరులాంటి ముక్కు, దొండపండులాంటి పెదాలు... ఇంకా ఇంకా చెప్పాలంటే, బాపూ గీచిన బొమ్మ అని అనను గాని ఆయన శిష్యుడు గీచిన బొమ్మతో పోల్చవచ్చు.

అమ్మయ్య! నా కష్టాలు గట్టెక్కినట్టే అని గుండెనిండా గాలి పీల్చుకుని వదిలాను. కానీ నాకేం తెలుసు అసలు గండం ఇక్కడే మొదలవుతుందని?

పెళ్లయిన వెంటనే భాగ్యాన్ని నాతో కాపురానికి పంపించేశారు కాబట్టేన్నీ, అంతేగాక నేను మా మామగారింటికి ఎక్కువగా వెళ్లేవాడిని కాదుకాబట్టేన్నీ నాకు నా మరదలితో పెద్ద చనువుకూడా ఏర్పడలేదు. ఏదో ఒకటి, రెండు మాటలు మాత్రం నవ్వుతూ మాట్లాడేది మరదలు. అంతకుమించి పెద్దగా జోకులు, గీకులు లాంటివి నేనూ వేయలేదు. అసలలాంటి సందర్భమూ రాలేదు.

మామగారు చెప్పవలసిందంతా చెప్పారు. నేను వినవలసినదంతా విన్నాను. ఆయన్ని బస్సెక్కించి ఇంటికి వచ్చాను.

మా మరదలు - అదే కృష్ణవేణి చాలా చలాకీ పిల్ల అని ఇప్పుడిప్పుడే తెలియడం మొదలయింది. తన భుజం నాకు తగిలేటట్లు నిలబడుతూ అంది ''బావా! ఈ శుభ సమయంలో నాకేం బహుమతి ఇస్తావ్?'' అని కొంటెగా నవ్వుతూ అదే ప్రశ్నకోసం చాలాకాలంనుంచి ఎదురుచూస్తున్న నేను చటుక్కున ఆమె చెయ్యి పట్టుకుని, దగ్గరకు లాక్కున్నాను. ఆమె బుగ్గగిల్లి... చిలిపిగా ఆమె

## అద్దానికి శత్రువు



అమెరికాలో ఫిలడెల్ఫియాకు చెందిన లిసిబెనివిల్ అనే ఆమెకి విచిత్రమైన శక్తి వుంది. ఈమె అలా అద్దం ముందుకు వెళితే చాలు అది ఎంత పెద్ద అద్దమయినా, ఎంత మందమాటిదైనా భళ్లున ముక్కలైపోవలసిందే. టీవి ముందుకు వస్తే టీవీ స్క్రీన్ ఢాం అంటుంది. కారెక్కితే ముందు వెనుక అద్దాలు ఫట్! అద్దంలో చూసుకునే అదృష్టం ఈమెకు లేదు. ప్రత్యేకించి ఈమెను పలుమార్లు పరిశోధక బృందం పరిశీలించడం జరిగిందికానీ కారణం ఏమిటన్నది ఈ రోజుకీ అంతుచిక్కని రహస్యంగానే మిగిలింది.

-ఎం. రజనీశకుంతల (సికింద్రాబాద్)

చెంపల దగ్గర నా పెదాలు చేరుస్తుండగా క్లిక్‌మని ఏదో ఫ్లాష్ వెలిగింది. నాకేమీ అర్థంకాలేదు. వెంటనే కృష్ణవేణి నన్ను వెనక్కితోసి, కాస్త కోపం, కాస్త చికాకు ప్రదర్శిస్తూ చిన్న లెక్చర్ మొదలుపెట్టింది.

''ఇదిగో బావా! నువ్వు నా అక్క మొగుడివి కనుక కాస్త సరదాగా వున్నాను కాని ఇలా నా చనువుని ఆసరాగా తీసుకుని నువ్వేదేదో ఊహిస్తే, అది పొరబాటు. అసలు విషయం చెబుతున్నాను, విను. మా అక్క, నేను తనకి పెళ్లి అయిన కొత్తల్లో ఒక విషయంపై వాదనకి దిగాము. అదేమిటంటే ''పురుషులలో పుణ్యపురుషులు వేరే వుంటారు. అలాంటి వారిలో మా ఆయన మొదటివాడు'' అంది తను.

''ఎంతటి శ్రీరామచంద్రుడులాంటివాడైనా పరస్త్రీ కనబడితే చలించక మానడు తెలుసా?'' అన్నాను నేను. అంతే ఇద్దరం పందెం వేసుకున్నాం. ''నేను ఎదుట ఉన్నా లేకున్నా నన్ను తప్ప మరో స్త్రీని కన్నెత్తి చూడని మా ఆయనకి నువ్వు శృంగభంగం చేస్తే నీకు వెయ్యిరూపాయలు ఇస్తాను, లేకపోతే నువ్వు నాకు వెయ్యి రూపాయలు ఇవ్వాలి'' అని మా అక్క నాతో పందెం వేసింది. అంతేకాక ప్రూఫ్‌కోసం ఒక ఆటోమేటిక్ కెమెరాకూడా తెచ్చుకున్నాను. ఇందాక వెలిగిన ఫ్లాష్ అదే సుమా! అంటే నీ నిజస్వరూపం ఇప్పుడు నా కెమెరాలో బందీగా వుందన్నమాట. బావా! మహానుభావా! ఇప్పుడర్థమైందనుకుంటాను. ఇదంతా అక్కడ చేసిన ప్లానే. ఎలాగుంది మన ఎత్తు? అయిపోయావు చిత్తు. నేనే గెలిచానోచ్''

వెంటనే నా నోట్లోంచి వచ్చిందొక శబ్దం 'హాచ్' అంతా ఏమిటో గమ్మత్తు. వదిలింది నా మత్తు' అనుకున్నాను.

అప్పుడే రేడియోలో సన్నగా వినబడుతోంది త్యాగరాజ కీర్తన. ''ఎంతనేర్చినా, ఎంత జూసినా, ఎంతవారలైన కాంతదాసులే'' అని. నాకు ముచ్చెమటలు పోశాయి.

''సారీ కృష్ణా! నన్ను క్షమించు. ఆ ఫోటో అక్కకి చూపించి నా పరువు తీయకు. నీకు వెయ్యికాదు. రెండు వేలు నేనిస్తాను'' అని నేననగానే, ''ఫోటో చూపించి, గెలిచానని నిజం చెప్పి అక్క దగ్గర వెయ్యి తీసుకోవాలా లేక ఫోటో దాచేసి, ఓడిపోయానని అబద్ధం చెప్పి నీ దగ్గర రెండువేలు తీసుకోవాలా?'' అని ఆమె అడిగిన కొంటె ప్రశ్న భారతంలోని ద్రౌపది ప్రశ్న ''తానోడి నన్నోడెనా? నన్నోడి తానోడెనా?'' అన్నదాన్ని స్ఫురణకి తెచ్చింది. నేను నిరుత్తరుడనై, నాకంటె ఆమె ఎంత ఎత్తుకు ఎదిగిపోయిందోనని ఆశ్చర్యపోయాను.

చివరగా ఒక్కమాట. మళ్లీ మనిషి జన్మే గనక వుంటే భాగ్యమే నా భార్య కావాలని కోరుకున్నాను. కోరుకుంటున్నాను. (దీనిభావం మీకు తెలిసిందనుకుంటున్నాను)

!!!